"నీకు అమ్ముందా! మా తాతయ్యకి అమ్మ లేదట. అమ్ముంటే ఎంతో మంచిది. అప్పచ్చులు చేసి పెడుతుంది" అన్నాడు.

"మళ్లా ఎప్పుడు వస్తావు తాతా?" అని ప్రశ్నించాడు చిట్టిబాబు.

ఈ ఊరు తిరిగి కావలసిన పనేముంటుంది? కొత్త కట్టడాలు లేచిందికి ఇదేం పెద్ద పట్నం కాదు. ఉన్న ఒక్క అవసరం తీరిపోయింది. తిరిగి ఈ జన్మలో తను ఈ మట్టిమీద కాలు పెట్టకపోవచ్చును అనుకొన్నాడు గోపన్న. ఆ ఆలోచన అతనికి బాధాకరమయింది. తిరిగి తను చిట్టిబాబుని చూడబోననే సత్యం కళ్ల ముందు సుళ్లు తిరిగింది. కళ్లలో నీళ్లు తిరిగాయి గోపన్నకి. అతడి ముఖాన్ని వింతగా చూస్తూ, "మళ్లా రావా తాతా" అన్నాడు చిట్టిబాబు. ఆత్రంగా గోపన్న కళ్లు తుడుచుకొని చిట్టిబాబుని చేతుల్లోకి తీసుకొన్నాడు. "ఎందుకు రాను బాబూ, నువ్వు పెద్దవాడివై బ్రిడ్జీలు కడితే మరి నేను గోతులు తవ్వొద్దూ" అన్నాడు.

"అవును తాతా! నువ్వు పెద్ద పెద్ద గోతులు లోతుగా, ఇంకా లోతుగా తవ్వాలి. నే పేద్ద ఆకాశమంత బ్రిడ్జి కడతాను" అన్నాడు చిట్టిబాబు ఉత్సాహంగా.

రెండు రోజులనాడు ఆ ప్రదేశం నుండి కూలీల గుడిసెలు తీసివేసారు. అక్కడ అంతా బాగుచేసి పెద్ద పందిరి వేశారు. దానికి రంగు కాగితాల తోరణాలు కట్టారు. పందిరి స్తంభాలను అరటి మొక్కలతో అలంకరించారు. ఈ హంగామా అంతా చిట్టిబాబు చూశాడు.

"నాన్నా అక్కడ పందిరి ఎందుకు వేశారు?" అని ప్రశ్నించాడు.

"ఈ రోజు మంత్రిగారు వచ్చి కొత్తగా కట్టిన ఆ బ్రిడ్జికి ప్రారంభోత్సవం చేస్తారు. అక్కడ సభ జరుగుతుంది' అన్నాడు తండ్రి.

చిట్టికి తండ్రిమాట అర్థం కాలేదు.

"అంటే?" తిరిగి ప్రశ్నించాడు.

"నీ కెలా చెప్పినా బోధపడదురా, అంతా చూస్తూ ఉండు, నీకే తెలుస్తుంది. రేపటి నుండి మనం అంతా ఆ బ్రిడ్జీమీంచి నడవచ్చు" అన్నాడు.

చిట్టిబాబు ఎంతో ఓపికతో అక్కడ జరుగుతున్న ప్రతి పనిని చూస్తున్నాడు. ఆ రోజు ఊళ్లోకి చాలా కార్లు వచ్చాయి. ఎంతో మంది మనుష్యులు వచ్చారు. కుర్చీలలో కూర్చున్న వాళ్లకి పువ్వుల దండలు వేశారు. పాటలు పాడారు. అన్నీ చూస్తున్నా, వింటున్నా అక్కడ జరుగుతున్న దేమిటో చిట్టికి అర్థం కాలేదు.

"అన్నయ్యా వీళ్లంతా ఏం చేస్తున్నారురా?" అని ప్రశ్నించాడు.

"అదిగో ఆయన మాట్లాడుతున్నారు, విను" అన్నాడు చిట్టిబాబు అన్న.

మధ్య కుర్చీలో కూర్చున్న ఆయన లేచి ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు. చాలా శ్రద్ధగా విన్నాడు చిట్టి. కాని కొంచెం కూడా బోధపడలేదు.

